వైద్యులకు రక్షణ లేకపోతే ఎలా?



అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వైద్యం అందించి ప్రాణాలు కాపాడే వైద్యులకు రక్షణ లేకపోతే ఎలా. కోల్‌కతాలో జరిగిన దారుణం యావత్ దేశాన్ని కలచివేసింది. వైద్య సిబ్బంది ఆందోళన చెంది రోడ్లపైకి వచ్చి నిరసనలు వ్యక్తం చేయాల్సి వచ్చింది. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు కష్టపడుతున్న వైద్యులకు రక్షణ కల్పించాలి. రాత్రి సమయంలో వైద్య సేవలు అందించే మహిళా వైద్యులకు ప్రత్యేక భద్రత ఏర్పాటు చేయాలి.

– పలుకూరి రవీంద్రబాబు, హెల్త్ అసిస్టెంట్ ఓబులవారిపల్లె

పటిష్ట భద్రత కల్పించాలి



నైటీ డ్యూటీలు చేసే క్రమంలో మహిళా వైద్యులు, వైద్య సిబ్బందికి పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి. రాత్రిళ్లు ప్రజలు సేవలు అందించేందుకు వైద్యసిబ్బంది విధుల్లో ఉంటారు. రోగుల బంధువులు వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడి పాల్పడకుండా ఉండేందుకు పోలీసు ప్రొటెక్షన్ ఇవ్వాలి. కోల్‌కతా లాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– రాధిక, స్టాఫ్ నర్స్, ఏరియా హాస్పిటల్, రాజంపేట



సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



కోల్‌కతాలో పీజీ డాక్టర్ మౌమితపై జరిగిన హత్యాచారం కేసులో నిందితులకు అరబ్ దేశాలలో లాగా శిక్షలు అమలు చేయాలి. అలాగే ఆసుపత్రులలో సిబ్బందికి రక్షణ కల్పించాలి. రాత్రి సమయాలలో పోలీస్ పర్యవేక్షణ ఉండాలి. లేదంటే మా లాంటి వారికి ఉద్యోగరీత్యా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రభుత్వం వెంటనే ఆసుపత్రి పరిధిలో సీసీ కెమెరాలతో పర్యవేక్షించాలి.

– చంద్రకళ, స్టాఫ్ నర్సు, ఏరియా ఆసుపత్రి, లక్కిరెడ్డిపల్లె

నిందితులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. ఆసుపత్రి ఏరియాలో విధి నిర్వహణలో ఉండే మహిళా డాక్టర్లకు, వైద్య సిబ్బందికి భద్రత కల్పించేందుకు సీసీ కెమెరాలు ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. మహిళా వైద్యుల కోసం ఆసుపత్రి వద్ద పోలీసులు రక్షణ కల్పించాలి. రాత్రి సమయాలలో సెక్యూరిటీని నియమించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ సుమలత, కోనంపేట పీహెచ్‌సీ, లక్కిరెడ్డిపల్లె

క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ సుధాకర్

నందలూరు : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని రాజంపేట డీఎస్పీ సుధాకర్ హెచ్చరించారు. సోమవారం నందలూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులు, రెండు గ్రేవ్ కేసుల ఫైళ్లను వారు పరిశీలించి, ఒక గ్రేవ్ కేసులో ముద్దాయి అరెస్టు పెండింగ్ ఉన్నందున వారంలోగా అరెస్టు చేయమని ఎస్‌ఐ వెంకటేశ్వర్లుకు ఆదేశించారు. అలాగే కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, మండల పరిధిలో శాంతి భద్రతలు పరిరక్షించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని, రోడ్డు ప్రమాదాలు నివారించాలని, స్థానిక బస్టాండ్ కూడలిలో ట్రాఫిక్‌ను నియంత్రించాలని సిబ్బందికి తెలియజేశారు.

ఏకీకృత పెన్షన్ విధానాన్ని అంగీకరించం

రాయచోటి అర్బన్ : ఉద్యోగులకు ఏమాత్రం ప్రయోజనాన్ని చేకూర్చని ఏకీకృత పెన్షన్ విధానాన్ని అంగీకరించమని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు అన్నారు. సోమవారం రాయచోటిలో యూటీఎఫ్ ముఖ్యనేతల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ ఉద్యోగులను తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో భాగంగానే కేంద్రప్రభుత్వం ఎన్‌పీఎస్ పేరును ఏకీకృత పెన్షన్ స్కీం (యూటీఎఫ్)గా మార్చిందన్నారు. కేంద్రం అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని ఎండగడుతూ ఓపీఎస్ కోసం పోరాటం కొనసాగిస్తామన్నారు. సమావేశంలో యూనియన్ నేతలు సుధాకర్‌నాయుడు, శివారెడ్డి, రమణమూర్తి, భాస్కర్‌రెడ్డి, అక్రమ్‌బాషా, శ్రీధర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగుల సమస్యలపై ఈనెల 28వ తేదిన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమకు ఉద్యోగాలు వస్తాయన్న ఆశతో నిరుద్యోగులంతా ఓట్లు వేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులకు భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు ఆనంద్, నరేష్, ఖాజా వలీ, రామచంద్ర, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిలే నిరసన దీక్షలను జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : తమ సంస్థ రాష్ట్రసమితి పిలుపు మేరకు ఈనెల 27, 28, 29 తేదీలలో కలెక్టరేట్ ఎదుట నిర్వహింప తలపెట్టిన రిలే నిరసన దీక్షలను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు కోరారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ వసతిగృహాలలో చోటుచేసుకున్న సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో రిలే నిరసన దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాయచోటి ఏఐఎస్‌ఎఫ్ నేతలు శ్రీధర్‌నాయక్, సతీష్‌నాయక్, రఘుపతి, మణికంఠ, మధు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నందలూరు : మండలంలోని పొత్తపి హరిజనవాడలో పేకాట ఆడుతున్న పది మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు వచ్చిన సమాచారం మేరకు సోమవారం తమ సిబ్బందితో దాడి చేయగా పేకాట ఆడుతున్న పది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 5400లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలియజేశారు.

పుల్లంపేట రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని మృతదేహం

పుల్లంపేట : పుల్లంపేట రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి(40) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు రేణిగుంట రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ గౌరీ శంకర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రేణిగుంట రైల్వే ఎస్‌ఐ రవి 9963126343, 9885753379 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

అంబరాన్నంటిన శ్రీ కృష్ణాష్టమి సంబరాలు

- చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణల్లో కనువిందు చేసిన చిన్నారులు
- ఆలయాల్లో వైభవంగా కల్యాణ వేడుకలు
- ఆకట్టుకున్న ఉట్టి కొట్టే కార్యక్రమం



నందలూరు: అరవపల్లిలో జరిగిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణుడి కల్యాణంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు



పెనగలూరు: విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న వేణుగోపాల స్వామి



సుండుపల్లె: ప్రత్యేక పూజలందుకున్న శ్రీకృష్ణుడు



సిద్దవటం: భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం



ఓబులవారిపల్లెలో ఉట్టి కొడుతున్న చిన్నారి



రైల్వేకోడూరు అర్బన్: ప్రత్యేక అలంకారంలో కృష్ణ పరమాత్ముడు

సిద్దవటం : మండల కేంద్రం సమీపంలోని మూలపల్లె క్రాస్ రోడ్డు వద్ద వెలసిన శ్రీ రాధా కృష్ణ స్వామివారికి పూజలు వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం స్వామి వారికి గణపతిపూజ, అభిషేకం, అలంకరణ, పుణ్యాహావాచనం తదితర పూజా కార్యక్రమాలను వేద పండితులు హరిప్రసాద్‌శర్మ, నరసింహశర్మలు జరిపారు. అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు స్వాముల వారిని దర్శించుకొని కాయాకర్పూరాలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని పలు ఆలయాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా సోమవారం నిర్వహించారు. మైసూరావారిపల్లిలోని శ్రీకృష్ణ దేవస్థానంలో మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, అలంకరణ చేశారు. అలాగే వైభవంగా శ్రీకృష్ణ, రుక్మిణీ కల్యాణంలో వేలాది మంది భక్తుల పాల్గొన్నారు. పెద్దఎత్తున భక్తులకు అన్న వితరణ చేశారు. పట్టణంలోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. అలాగే సాయంత్రం భగవద్గీత పారాయణం, ఉట్టి ఉత్సవం నిర్వహించారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : మండల పరిధిలోని పలు గ్రామాలలో సోమవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి చిన్నపిల్లలు కృష్ణుని, గోపికల వేషధారణలు, ఆటపాటలతో ఆకట్టుకున్నారు. అనంతరం పలు ఆలయాలలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. పలు ప్రాంతాలలో ఉట్టి కొట్టడం, వివిధ రకాల కార్యక్రమాలతో ఎంతో ఉత్సాహంగా జరుపుకొన్నారు.

రాజంపేట రూరల్ : శ్రీకృష్ణ పరమాత్ముని జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం మండలంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. శ్రీకృష్ణుడి దేవాలయాలను సుందరంగా అలంకరించారు. అదే విధంగా స్వామివారికి వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశార. అదే విధంగా ప్రైవేటు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆకేపాటి ఎస్టేట్‌లో ఆకేపాటి అమరనాథరెడ్డి ఇంగ్లిష్ మీడియం స్కూల్ నిర్వహించిన వేడుకలలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

జయకృష్ణా ముకుందా మురారీ

రాజంపేట టౌన్ : నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం ప్రజలు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా శ్రీకృష్ణుడు, వేణుగోపాల స్వామి ఆలయాల్లో వేకువజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. రాజంపేట పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా జరిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం కల్యాణ ఉత్సవ మూర్తులు పట్టణంలోని పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కాగా ఏబీ చంద్రారెడ్డి గార్డెన్స్‌లో ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను వైభోవోపేతంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. చిన్నపిల్లలు రాధా, గోపికల వేషధారణలతో అలరించారు.

గీతాసారంతో జీవితసారం చెప్పిన శ్రీకృష్ణ పరమాత్ముడు

గాలివీడు : గీతాసారంతో జీవితసారం చెప్పిన శ్రీకృష్ణ పరమాత్ముడిని స్మరించుకోవడం అంటే మన కర్తవ్యాన్ని మనం గుర్తు చేసుకుని ముందుకు సాగడమేనని అర్చకులు నాగఫణి కిషోర్ శర్మ పేర్కొన్నారు. సోమవారం గాలివీడు పట్టణం అరవీటివాండ్లపల్లెలోని శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏ విషయంలో అయినా మనకు స్ఫూర్తినిచ్చే శ్రీకృష్ణ తత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే ప్రతి అంశంలో మనం విజయం సాధించవచ్చని వివరించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాదాల వితరణ గావించారు.

శ్రీకృష్ణ భగవానుడి పుట్టిక మహాద్భుతం

రామాపురం : శ్రీకృష్ణ భగవానుడి పుట్టుక మహాద్భుతమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని బండపల్లె సమీపలలోని ప్రేమాలయంలో శ్రీకృష్ణా ఆలయంలో సోమవారం వైభవంగా జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. కృష్ణాష్టమి సందర్భంగా ప్రేమాలయం నిర్వాహకులు మధుసూదన్‌రెడి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు, వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించి శ్రీకాంత్‌రెడ్డిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ రెస్కో చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, గంగిరెడ్డి, రవిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రమణయాదవ్, లక్ష్మయ్యయాదవ్, తదితరులు పాల్గొన్నారు. అలానే మండలంలో కృష్ణాష్టమి వేడుకలు భక్తులు అత్యంత ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని హరిహారాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి విశేషంగా అలంకరించారు. అనంతరం శ్రీకృష్ణుడి చిత్రపటంతో భారీ ఊరేగింపు నిర్వహించారు. మండలంలోని హిందూ ధార్మిక సంఘం ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ కార్యకర్తలు కార్యక్రమాలను పెద్ద ఎత్తున పాల్గొని ర్యాలీ నిర్వహించారు.

కమనీయం శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణ కల్యాణం

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లి శ్రీ కృష్ణ మందిర ఆవరణలో అశేష భక్తుల మధ్య సోమవారం శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణ కల్యాణం కమనీయంగా జరిగింది. వేద పండితులు బండాత్మకూరు శివ కుమార్ శర్మ, నరసా రవికుమార్, సునీల్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కల్యాణానికి అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఓం శాంతి నగర్‌లో బ్రహ్మ కుమారీలు ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ ఉభయదారులుగా భారతాల శివ యాదవ్, లక్ష్మీదేవి దంపతులు వ్యవహరించారు. ఈ కల్యాణంలో చిన్నారులను తల్లిదండ్రులు చిన్ని కృషుని వేషధారణ చేసి కల్యాణ వేదిక దగ్గరికి తీసుకువచ్చారు. తాటి సుబ్బరాయుడు, లక్ష్మీదేవిల ఆధ్వర్యంలో ఉదయం గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ కన్వీనర్ సిద్దవరం గోపిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గొబ్బిళ్ళ త్రినాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు గీతాల నరసింహారెడ్డి, గడికోట వెంకటసుబ్బారెడ్డి, భాస్కర్ యాదవ్, ఆనాల మధుయాదవ్, నడివీధి సుధాకర్, మధు రాజు, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, పునగాని గుణ యాదవ్, పుత్త శంకర్, మాబాషా, శివ తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం వేకువజాము నుంచి వేదపండితులు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేణుగోపాలస్వామి అలంకరణ, ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం మధుసూదన్ అనే భక్తులు నిర్వహించినట్లు గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య తెలిపారు. అలాగే మధ్యాహ్నం కొత్త బాలకృష్ణ అన్నదాన కార్యక్రమం, ప్రసాదం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కృష్ణాష్టమి సందర్భంగా వేణుగోపాలస్వామి ఆలయంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువత పెద్దఎత్తున పాలొన్నారు.

సుండుపల్లెలో..

సుండుపల్లె : మండల పరిధిలోని పలు గ్రామాలలోని ప్రజలు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అర్చకులు ఉదయాన్నే స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, వేడుకలు ఘనంగా నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. అనంతరం భక్తులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందించారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : కృష్ణాష్టమి వేడుకలను సోమవారం మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. స్థానిక శ్రీ రిషీ పాఠశాలలో విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.

వీరబల్లిలో..

వీరబల్లి : మండలంలోని శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అతిపురాతనమైన శ్రీహరిహర దేవాలయంలో, సాయిబాబా గుడిలో ఘనంగా పూజలు నిర్వహించి ప్రసాదాలను పంపిణీ చేశారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు భక్తులు, ప్రజలు దేవాలయాలలో తమ ఇళ్లలో ప్రత్యేక పూజలు చేశారు.



నందలూరు: కల్యాణ వేడుకలో ఉత్సవమూర్తులు



వీరబల్లి: స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



రైల్వేకోడూరు అర్బన్: వైభవంగా నిర్వహించిన శ్రీకృష్ణుడి కల్యాణం



రాజంపేట టౌన్: రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి



రాజంపేట రూరల్: చిన్నారులతో ఎమ్మెల్యే ఆకేపాటి దంపతులు



రాజంపేట టౌన్: రాధా, గోపికల అలంకరణలో చిన్నారులు



రాజంపేట రూరల్: ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు



రామాపురం: పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ హయాంలో ఆలయ నిర్మాణాలకు పెద్దపీట



సంబేపల్లె: ప్రత్యేక పూజలనంతరం గ్రామస్తులతో మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి (జగదాంబ సెంటర్): శ్రీకాంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

సంబేపల్లె : ఆలయాలు నాగరికతకు ప్రతీకలని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీ పాన్నెళ్ల వాండ్లపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ గుర్రప్ప స్వామి ఆలయంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, షేట్ వెంకట్రమామిరెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఆలయాల నిర్మాణాలకు గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేసిం అపర శ్రీకృష్ణదేవరాయులుగా పేరొందారన్నారు. రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా తిరుమల శ్రీవాణి ట్రస్ట్ ద్వార 76 ఆలయాలు మంజూరు చేశామని చెప్పారు. త్వరలోనే ఆ నిర్మాణపు పనులన్నీ పూర్తి అవుతాయని తెలియజేశారు. రాయచోటిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం పశ్చిమ గోపురం, మాఢ వీధులు, సంబేపల్లె మండలంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయ అభివృద్ధి పనులు దాదాపు పూర్తయ్యాన్నారు. పసుపతి గృహేశ్వర, శెట్టిపల్లె గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహ, చిన్నమండెం మండలంలోని మండెం లక్ష్మీనరసింహస్వామి, మల్లాలరమ్మ, ఆలయ నిర్మాణాలకు పెద్ద ఎత్తున సీజీఎఫ్ నిధులు మంజూరుకు కృషి చేశామన్నారు. ఆలయాల నిర్మాణాలతో అధ్యాత్మిక శోభ ఉట్టి పడటం సంతోషంగా ఉందన్నారు. దేవుని దయతో వర్షాలు బాగా కురిసి ప్రజలు, రైతులు, సంతోషంగా ఉండాలని శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. అనంతరం గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాయచోటి జెడ్పీటీసీ వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు వి.వి.ప్రతాప్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, నాగరాజు యాదవ్, శివశంకర్ యాదవ్, ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ రామచంద్ర, అన్నారెడ్డి, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంత్‌రెడ్డికి ఘన సత్కారం

రాయచోటి (జగదాంబ సెంటర్) : రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులు కావడంతో కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. సోమవారం స్థానిక వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో శ్రీకాంత్‌రెడ్డికి వారు గజమాలతో సన్మానించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, కౌన్సిలర్లు, పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నాయకులు పరామర్శించిన గడికోట

రాయచోటి అర్బన్ : అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి పొందుతున్న వైఎస్ఆర్‌సీపీ నేత, మున్సిపల్ చైర్మన్ తండ్రి ఇలియాస్‌బాషా తోపాటు మరోనేత అష్రఫ్‌ను వారి ఇళ్లలో మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. వారి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలంటూ ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా, కౌన్సిలర్ హారూన్‌బాషా, వైఎస్ఆర్‌సీపీ నేత రియాజుర్ రహిమాన్, ఖలీల్, ఏకే తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవ స్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవం



మాజీ ఎమ్మెల్యే ప్రభావతమ్మ ఇంటివద్ద విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనగలూరు : కొండూరు గ్రామంలో నిర్మించిన చెన్నకేశవ స్వామి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ కొండూరు విజయ్‌రెడ్డి తెలిపారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ ఆలయానికి దేవాదాయశాఖ తరపున రూ. 55 లక్షల నిధులను రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ మాజీ చైర్మన్ కె.అజయ్‌రెడ్డి మంజూరు చేయించినట్లు వారు తెలిపారు. సోమవారం మొదటగా మాజీ ఎమ్మెల్యే ప్రభావతమ్మ ఉత్సవ విగ్రహాలకు అక్కడ వేదపండితులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం 2 వేల మందికి మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.